క్లుప్తంగా

వాసుదేవస్వామి సేవలో మేయర్ దంపతులు



పూజల్లో పాల్గొన్న మేయర్ నూర్జహాన్ దంపతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : పవర్‌పేట శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వాసుదేవ స్వామి దేవస్థానంలో వాసుదేవ స్వామి వారిని నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు శనివారం దర్శించుకున్నారు. విశేష పూజలు చేసి, మొక్కులు సమర్పించుకున్నారు. ఉదయం స్వామి వారికి తిరుమంజనం చేశారు. సాయంత్రం స్వామి వారికి లక్ష తులసీదళ పూజ, గోదా దేవికి సామూహిక లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అర్చకులు కందుకూరి వేంకట విజయ్ కుమార్ ప్రత్యేక పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి ఎం రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పిల్లలకు మంచి భవిష్యత్తు అందించాలి



మేదర్ల కాలనీలో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్) : ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని పిల్లలకు మంచి భవిష్యత్తు అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తల్లిదండ్రులకు సూచించారు. స్థానిక పవరుపేటలోని మేదర్ల కాలనీలో బాలకార్మిక వ్యవస్థపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు వారి పిల్లలను బడికి పంపకుండా పనిలో పెట్టి పనులు చేయించడం చట్ట రీత్యా నేరమన్నారు. ఆపరేషన్ స్వచ్ఛ 2024లో భాగంగా తాము కాలనీని సందర్శించినట్లు చెప్పారు. కార్యక్రమంలో దిశ సీఐ క్రాంతి ప్రియ, ఏఎల్‌జే గోపాలకృష్ణ, ప్యానల్ లాయర్లు కె.కృష్ణారావు, కె.సత్యనారాయణ, జీవీజీ భాస్కర్, హెల్ప్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

- అనంతరం జిల్లా న్యాయసేవాధికార భవన్‌లో మానవ అక్రమ రవాణా నిరోధం అనే అంశంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.పద్మావతి, డీసీసీఓ కె.సూర్యచక్రవేణి, వినియోగదారుల ఫోరం సభ్యురాలు నాగలక్ష్మి, సీఐ దుర్గాప్రసాద్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పెన్షనర్స్‌కు విజ్ఞప్తి

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్స్ ఫిబ్రవరి 29వ తేదీలోపు స్థానిక ఖజానా కార్యాలయాల్లో లైఫ్ సర్టిఫికెట్లు (పెన్షనర్స్ వెరిఫికేషన్ వార్షిక సర్టిఫికెట్లు) సమర్పించాలని జిల్లా ఖజానా, లెక్కల శాఖ అధికారి టి.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పత్రాలతోపాటు నాన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్లు, నాన్ రీ మ్యారేజ్ సర్టిఫికెట్లు భీమడోలు, చింతలపూడి, ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, కుక్కునూరు, కైకలూరు, నూజివీడు ట్రెజరీ కార్యాలయాలు లేదా పోస్టాఫీసులు, నెట్ సెంటర్లు, జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సమర్పించవచ్చని పేర్కొన్నారు. పింఛనుదారులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆన్‌లైన్ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణకు సరళమైన విధానంలో ప్రారంభించిందని తెలిపారు.

డీ పీఆర్‌టీయూ జిల్లాల కార్యవర్గాలు ఎన్నిక



ఏలూరు జిల్లా శాఖకు నియామక పత్రం అందిస్తున్న రాష్ట్ర నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డెమోక్రటిక్ పీఆర్‌టీయూ ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం స్థానిక డీపీఆర్‌టీయూ ఏలూరు జిల్లా కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగింది. ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నేతల చంద్రశేఖర్ ఆజాద్, మణిపూరి రాంబాబు, సంఘ గౌరవ అధ్యక్షుడిగా ఎన్ గంగాధరరావు, కోశాధికారిగా ఆర్ నాగేంద్ర సింగ్, సభ్యులుగా ఎస్ అప్పారావు, ఎస్ శ్రీనివాస్, జి.గోపీ కిషోర్, ఎస్ వేణుగోపాల్ ఎన్నికయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా విజ్జేశ్వరపు వెంకటరావు, పప్పల తమ్మినాయుడు, సభ్యులుగా పీవీఎస్ దుర్గాప్రసాద్, ఎస్ఆర్ అప్పారావు, బీవీవీ సత్యనారాయణ, ఎం విక్టర్ బాబు ఎన్నికయ్యారు. శేషపు శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన కార్యవర్గాలకు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, గౌరవ సలహాదారు మరడాని అచ్యుతరావు నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగరాజు వెంకటరాజు, సంఘనాయకులు ఎం రాంబాబు, ఆర్ వెంకట్, కొత్తపల్లి సూర్యచంద్ర, ఎన్‌వీకే వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.3 వేలు.. ఆనందోత్సాహాలు

- ఏలూరు నియోజకవర్గంలో మొత్తం పింఛన్లు 29,664
- పంపిణీ చేస్తున్న మొత్తం రూ.8.96 కోట్లు
- కొత్తగా 201 పింఛన్ల మంజూరు

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వం పింఛను మొత్తం రూ.3 వేలకు పెంచి పంపిణీ చేస్తుండడంతో లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న సామాజిక పింఛనుదార్లు 29,664 మందికి ప్రతినెలా ప్రభుత్వం రూ.8.96 కోట్లు అందజేస్తోంది. తాజాగా 281 మంది అర్హులకు పింఛన్లు మంజూరు చేసింది. ఇప్పటికే 65 శాతం పెన్షన్లను వాలంటీర్లు పంపిణీ చేశారు. పెంచిన పింఛన్ మొత్తాన్ని అందుకున్న లబ్ధిదారుల ముఖాల్లో సంతోషం వికసిస్తోంది. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ మొత్తాన్ని రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే ఆళ్ల నానిలకు లబ్ధిదారులు కృతజ్ఞతలు చెబుతున్నారు. కొత్త లబ్ధిదారులకు శనివారం ఎమ్మెల్యే ఆళ్ల నాని తన క్యాంపు కార్యాలయంలో పింఛను సొమ్ము అందజేశారు. లబ్ధిదారులు ఎమ్మెల్యే నానికి ధన్యవాదాలు తెలిపారు.



కొత్త పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఏలూరు 16వ డివిజన్‌లో చవటపల్లి జనని కి పింఛన్ అందిస్తున్న వాలంటీర్ రమేష్

ఏలూరు నియోజకవర్గంలో పింఛన్ల వివరాలు ఇలా..

వృద్ధాప్యం	13,975
చేనేత	769
వితంతు	9,063
వికలాంగులు	3,725
గీత కార్మికులు	47
చర్మకారులు	198
మత్స్యకారులు	36
ఒంటరి మహిళలు	1,428
ట్రాన్స్ జెండర్లు	31
అభయహస్తం	86
డీఎంహెచ్ఓ	169
సీకేడీయూ	69
డప్పు కళాకారులు	68

మొత్తం 29,664 మందికి నెల నెలా ఇచ్చే సొమ్ము రూ.8,95,98,000

ప్రభుత్వ సాయం మరువలేం



ప్రతి నెలా క్రమం తప్పకుండా మొదటి తారీఖునే వాలంటీర్ ఇంటికి తెచ్చి పింఛన్ మొత్తం అందిస్తున్నారు. కుటుంబ సభ్యుల కన్నా మిన్నగా ప్రభుత్వం తరుపున సీఎం వైఎస్ జగన్ చేస్తున్న ఆర్థిక సాయం మరువలేనిది. తెలవారక ముందే ఇంటి వాకిట పింఛను మొత్తం తీసుకొస్తున్న వాలంటీర్ వ్యవస్థ ఎంతో గొప్పగా పనిచేస్తోంది.

– మొకర సత్యవతి, లబ్ధిదారు, సబ్బవరపు వారి వీధి, ఏలూరు

ఠంఛన్‌గా పింఛన్



ప్రతి నెలా ఠంఛన్‌గా పింఛన్ అందజేస్తున్నారు. నాలాంటి వితంతువులకు ప్రభుత్వం అందించే పింఛన్ మొత్తం అత్యవసర ఖర్చులకు ఉపయోగపడుతుంది. నాయకులు చుట్టూ ప్రదక్షిణలు చేసే పని లేకుండా, ఆఫీసుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్ పంపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– కరణం సత్యవతి, లబ్ధిదారురాలు, కూనిశెట్టి వారి వీధి, కొత్తపేట

ఎన్నికల్లో సోషల్ మీడియా పాత్ర కీలకం

ఏలూరు రూరల్: వైఎస్సార్ సీపీ విజయంలో సోషల్ మీడియా కీలకపాత్ర పోషించాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కోరారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాలయం, మౌలిక వసతులు కల్పిస్తానని చెప్పారు. శనివారం చాటపర్రులో దెందులూరు నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్లు, కో కన్వీనర్లు, వారియర్స్‌తో భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో వేలాది మంది పేదలు ఆర్థికంగా, ఆరోగ్యంగా, విద్యాపరంగా లబ్ధి పొందారని ఎమ్మెల్యే చెప్పారు. వీరిని గుర్తించి సోషల్ మీడియా వారియర్స్ ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సప్ ద్వారా ప్రజలకు వివరించాలని కోరారు. దీనివల్ల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలకు జరిగిన మేలు ప్రతి ఒక్కరికీ తెలుస్తుందని చెప్పారు. ఇదే క్రమంలో ప్రతిపక్షాలు జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వంపై సోషల్ మీడియా ద్వారా చేస్తున్న అసత్యాలను తిప్పికొట్టాలని అన్నారు. రాబోయే నాలుగు నెలలు ఎంతో కీలకం అన్నారు. పార్టీ బీసీ నాయకుడు ఘంటా ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేసేందుకు టీడీపీ వేలాది మందిని నియమించిందన్నారు. దీన్ని గుర్తించి క్రియాశీలకంగా పని చేయాలని కోరారు. భేటీలో జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, తేరా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ఏలూరు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో నూర్జహాన్, శ్రీలక్ష్మి, శ్రీనివాస్

ఏలూరు టౌన్: ఏలూరు నగరాన్ని అభివృద్ధి పదంలో ముందుకు నడిపేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు వన్‌టౌన్ 16వ డివిజన్‌లో 600 మీటర్ల అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, పంపింగ్ చాంబర్ కమ్యూనిటీ హాలును ఆయన ప్రారంభించారు. 7, 13 డివిజన్లల్లో 38 సీసీ రోడ్లు, 18 డ్రెయిన్లు, 3 కల్వర్టుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వీటి నిర్మాణానికి సుమారుగా రూ.2.93 కోట్లు నిధులు ఖర్చు చేయనున్నట్టు నాని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు నగరంలో అభివృద్ధి పనులకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి సచివాలయానికి రూ.40 లక్షలు నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఈ నిధులతో పాటు నగరపాలక సంస్థ జనరల్ ఫండ్ నుంచి మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేస్తూ ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు గుడిదేశిశ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కార్పొరేటర్లు పిల్లంగోళ్ల శ్రీదేవి, నిడికొండ అన్నపూర్ణ, జిజ్జువరపు విజయనిర్మల, యువజన నాయకులు నిడికొండ నరేంద్ర, కోఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్, కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ, పార్టీ క్లస్టర్–1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు ఉన్నారు.

టీడీపీకి రానున్నవి ఆఖరి ఎన్నికలు

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలు టీడీపీకి ఆఖరి ఎన్నికలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు సైకిల్‌కు అభ్యర్థులు లేరని, ఒకరు గాలి కొడతానంటే, మరొకరు బెల్ కొడతానంటున్నాడని ఎద్దేవాచేశారు. 2024 ఎన్నికల్లో దెందులూరు నియోజకవర్గ నుంచి వైఎస్సార్ సీపీ 50 వేల మెజారిటీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో ఆయన ప్రజా ఆశీర్వాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని పాల్గొన్నారు. అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఒక్కో గ్రామంలో రూ.50 కోట్లు నుంచి రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇందులో తాగునీటి పైప్‌లైన్, ఓవర్‌హెడ్ ట్యాంకులు, బీటీ, సీసీ రోడ్లు, డ్రెయినేజీ, సచివాలయాలు, ఆర్‌బీకే, ఆరోగ్యశ్రీ క్లినిక్‌లు ఉన్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో సుమారు 1.50 లక్షల మంది ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో సీఎం జగన్ వేల కోట్ల రూపాయలు అందించారని వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిలో ఒక్కశాతం కూడా టీడీపీ చేయలేదని ఆరోపించారు. ఎన్నికల్లో గెలిచేందుకు టీడీపీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ప్రచారం చేస్తున్నారని, ప్రతిపక్షాల ప్రయత్నాలను ప్రజలే తిప్పికొట్టాలని కోరారు. వైఎస్సార్ సీపీని గెలిపించి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. యాత్రలో భాగంగా సర్పంచ్ గుడిపూడి రఘుతో కలిసి ఎమ్మెల్యే గడపగడపకు తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రూ.50 కోట్లతో పూర్తిచేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఇదే క్రమంలో సీసీ రోడ్లు, ఓవర్‌హెడ్ ట్యాంక్, కుళాయి, పాఠశాల అభివృద్ధి పనులు, తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేశారు. సంప్రదాయ డప్పుల వాయిద్యంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆయన వెంట చాటపర్రు సొసైటీ చైర్మన్ శిరిపురపు కోటేశ్వరరావు, ఎంపీటీసీలు గుత్తా గంగాభవాని, బోడిగడ్డ కుమారి, గుత్తా వెంకటేశ్వరరావు, బేబీ, పరుశురాం, శ్రీనివాస్, ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ మండల సరస్వతి, మండల కొండలరావు, తేరా ఆనంద్, బాపనయ్య, కొల్లేరు, దెందులూరు, పెదపాడు, పెదవేగి మండల నాయకులు ఉన్నారు.





చాటపర్రులో తహసీల్దార్ కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, అబ్బయ్యచౌదరి, చాటపర్రులో సీసీ రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే కొఠారు



చాటపర్రులో ప్రజా ఆశీర్వాదయాత్ర నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

అవ్వా, తాతల మోముల్లో చిరునవ్వు



మహిళకు పింఛన్ అందిస్తున్న మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలను పక్కాగా అమలు చేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏలూరు నగరంలో పెంచిన పెన్షన్ సొమ్ము రూ.3 వేలను లబ్ధిదారులకు ఆయన అందించారు. సీఎం జగన్ సంక్రాంతి పండుగ రోజుల్లో పేదల మోముల్లో సంతోషాన్ని చూసేందుకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌ను రూ. 3 వేలకు పెంచారని తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి విజయాన్ని అందించాలని నాని కోరారు. ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో 281 కొత్త పెన్షన్లు మంజూరయ్యాయని మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. శనివారం నగరంలోని పలువురు లబ్ధిదారులకు పెంచిన పెన్షన్ సొమ్మును ఆమె అందజేశారు. కార్పొరేషన్ 79 సచివాలయాల పరిధిలో ప్రతి నెలా 29,664 మందికి పెన్షన్లు అందిస్తున్నామన్నారు. ప్రతి నెలా 1వ తేదీన పెన్షన్ల రూపంలో రూ. 8.90 కోట్లు లబ్ధిదారులకు అందించేందుకు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని చెప్పారు. 50వ డివిజన్ ఈ నెల కొత్తగా 14 పెన్షన్లు మంజూరయ్యాయని, ప్రతి నెలా 617 మందికి పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, గవరపేట నాయుడు, సింగ్, శివ, మానుకొండ శ్రీను, నక్కా కృష్ణ తదితరులున్నారు.

యూరియా కలిసిన నీరు తాగి ఐదు పశువులు మృతి

- మరో 4 దూడలు, 5 గేదెలకు అందుతున్న చికిత్స
- రైతును పరామర్శించిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



గుండుగొలనుకుంటలో మృతి చెందిన గేదెను పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ జేడీ నెహ్రూబాబు, ఎమ్మెల్యే తలారి

ద్వారకాతిరుమల : మండలంలోని గుండుగొలను కుంటలో యూరియా కలిపిన నీరు తాగి ఐదు పశువులు మృతి చెందాయి. వాటిని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శనివారం ఉదయం పరిశీలించి, పాడి రైతు ఉజ్జి గంగరాజును పరామర్శించారు. వివరాల ప్రకారం. రైతు గంగరాజు రోజులానే తన పశువులను శుక్రవారం సాయంత్రం ఆయిల్‌పామ్ తోటలో కట్టేసి, వాటికి తాగునీటిని అందించాడు. అయితే రాత్రికి పశువులు నురగలు కక్కుతూ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడాన్ని గమనించిన రైతు వెంటనే వాటికి వైద్యాన్ని చేయించాడు. అయితే మూడు గేదెలు, ఒక ఆవు, ఒక దూడ మృతి చెందాయి. మిగిలిన 5 గేదెలు, నాలుగు దూడలకు వైద్యులు తెల్లవార్లు చికిత్సనందించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలారి హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకుని, బాధిత రైతును పరామర్శించారు. అలాగే ప్రమాదానికి గల కారణాలను ఎమ్మెల్యే తలారి, ఏలూరు జిల్లా పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూబాబు, భీమడోలు ఏడీ డాక్టర్ సాయిరమేష్, మండల పశువైద్యాధికారి అంగర సురేష్ స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. పక్క పొలం రైతు తన మొక్కజొన్న తోటకు డ్రిప్ ద్వారా యూరియాను అందిస్తున్నాడని, అది తెలియక ఆ పైప్ ద్వారా వెళ్లే నీటిని పశువులకు పెట్టడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని వారు తెలిపారు. పాడిపైనే ఆధారపడ్డ తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే తలారి వద్ద బాధిత రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. సుమారు రూ.3 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదిలా ఉంటే ఏలూరు ల్యాబ్ ఏడీ డాక్టర్ సుచరిత, డాక్టర్ జయశ్రీ మృతి చెందిన పశువులకు పోస్టుమార్టం నిర్వహించారు. రైతును పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, స్థానిక సర్పంచ్ బండారు ధనలక్ష్మి, సొసైటీ చైర్‌పర్సన్ గోపా నాగేశ్వరరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వామిశెట్టి ఆంజనేయులు, చిలుకూరి సుబ్రహ్మణ్యం, బండారు నాగ సుబ్రహ్మణ్యం, బండారు కాశీ, సాధనాల రాజా, బండారు వెంకన్నబాబు, కుమ్మరి రమేష్, ఎలమర్తి భాస్కరచౌదరి, మోహనరావు, మానుకొండ సుబ్బారావు, బొండాడ వెంకన్నబాబు తదితరులున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు



నాట్యాచారిణి శర్వాణి శిష్యులు నృత్య ప్రదర్శన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ప్రదర్శించిన సంగీత, ప్రవచన, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. సాయంత్రం నగరానికి చెందిన తాడిమేటి శుభ భక్తి సంగీత విభావరి వీనుల విందు చేసింది. ఉంగుటూరుకు చెందిన పాలా రామాంజనేయులు భాగవతార్ సీతా కల్యాణం అనే అంశంపై హరికథా గానం చేశారు. రాత్రి నగరానికి చెందిన ది వెంకట్రాయ నాట్య నిలయం ఆధ్వర్యంలో నాట్యాచారిణి నీలి శర్వాణి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ అన్నమయ్య, త్యాగరాజ కీర్తనలకు చిన్నారులు అద్భుత నాట్య విన్యాసాలు ప్రదర్శించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, విష్ణు సహస్ర నామ పారాయణ, స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం నిర్వహించారు.

ఆంగ్లంలో ప్రావీణ్యం అవసరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రస్తుతం ఆంగ్ల భాషలో ప్రావీణ్యం అవసరమని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక రామచంద్రావు పేట నారాయణ స్కూల్లో నిర్వహించిన స్పెల్ బీ గ్రాండ్ ఫినాలేలో ఆమె పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ విద్యార్థులంతా ఆంగ్ల భాషపై పట్టు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టారని చెప్పా రు. నారాయణ విద్యా సంస్థల ఏజీఎం పి.రామిరెడ్డి మాట్లాడుతూ స్పెల్ బీలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని నారాయణ విద్యార్థులు 9,500 మంది పాల్గొనగా తుది దశకు 33 మంది చేరుకున్నారని చెప్పారు. వీరికి పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎ.శ్రీనివాస్, ప్రిన్సిపాల్స్ హేమలత, వి.కామేశ్వరరావు, హెచ్ఓడీ వేదవతి వల్లూరి, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనీలు, కోఆర్డినేటర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎస్పీ సమన్వయకర్తగా రమేష్‌బాబు

ఏలూరు (టూటౌన్): బీఎస్పీ దెందులూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నేతల రమేష్ బాబు, అధ్యక్షుడిగా కర్రే అంబేడ్కర్‌లను రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి నియమించారు. బీఎస్పీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు సిర్రా భరత్ అధ్యక్షతన ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల బీఎస్పీ నాయకుల సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. పరంజ్యోతి, రాష్ట్ర కోఆర్డినేటర్ గుమ్మాపు చిత్రసేన్ పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపు నిచ్చారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారత రాజ్యాంగాన్ని తూట్లు పొడిచే విధంగా పరిపాలిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. శనివారం ఆయన స్థానిక మర్చంట్ చాంబర్ ఆఫ్ కామర్స్ కల్యాణ మండపంలో ఏపీ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు అధ్యక్షతన రాష్ట్రంలో దళిత, గిరిజన, బీసీ, మైనారిటీ, ప్రజా సంఘాలు, ప్రజాప్రతినిధులు, మేధావులతో సదస్సు నిర్వహించారు.

బైబిల్ మిషన్ చర్చి ప్రారంభం

పెదపాడు: మానవునికి ఆధ్యాత్మిక చింతన అవసరమని, దానికోసం తమ ఇష్టమైన దైవాన్ని ప్రార్థిస్తుంటారని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని సత్యవోలులో నూతనంగా నిర్మాణం చేసిన బైబిల్ మిషన్ చర్చిని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు క్రైస్తవ సోదరులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బైబిల్ మిషన్ అధ్యక్షుడు రెవ.ఫాదర్ సజీవరావు, పాస్టర్ లాజర్, పలువురు గ్రామపెద్దలు విశ్వాసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు వెంటనే విధుల్లో చేరాలి

ద్వారకాతిరుమల: ప్రభుత్వం ఎస్మా ప్రయోగించిన కారణంగా అంగన్‌వాడీలు వెంటనే విధుల్లో చేరాలని లేకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని తహసీల్దార్ పి.సతీష్ అన్నారు. స్థానిక మండల కార్యాలయాల వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలతో శనివారం తహసీల్దార్ సతీష్, ఎంపీడీవో తిరుపతిరావు, జంగారెడ్డిగూడెం సీడీపీవో బ్యూల తదితరులు మాట్లాడారు. వెంటనే విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగించేందుకు ప్రభుత్వం అత్యవసర సేవల చట్టం కింద ఎస్మా జీవో జారీ చేసిందన్నారు.